వరంగల్ ఎయిర్ పోర్టుకు రాణి రుద్రమ దేవి పేరు పెట్టాలి

- లేదంటే దీనిపై తెలంగాణ జాగృతి పోరాటం చేస్తాం
- ఓరుగల్లు ప్రజలు ఈ డిమాండ్ చేయాల్సిన అవసరం ఉంది
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

విశ్వంభర, వరంగల్ : వరంగల్‌లో రాబోతున్న ఎయిర్ పోర్ట్‌కి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్సీ కవిత హన్మకొండలో మీడియాతో మాట్లాడారు. వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టుకు రాణి రుద్రమ దేవి పేరు పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఓరుగల్లు ప్రజలు ఈ డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎందుకంటే కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న బస్టాండ్ నిర్మించినా.. రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ వంటి గాంధీ పేర్లు పెట్టి మన తెలంగాణ సంస్కృతిని వెనక్కి నెట్టే ప్రయత్నం చేస్తారని విమర్శించారు. రాణి రుద్రమ దేవి పేరు పెట్టే వరకు ఊరుకోవద్దని అన్నారు. దీనిపై తెలంగాణ జాగృతి పోరాటం చేస్తాదని, ఈ విషయంపై సంబంధిత కేంద్ర మంత్రికి లేఖ రాయబోతున్నట్లు చెప్పుకొచ్చారు. ఇక, వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రైతులకిచ్చిన రూ. 2లక్షల రుణమాఫీ హామీని కాంగ్రెస్ సర్కార్ నీరుగార్చిందన్నారు. రైతు డిక్లరేషన్ ఫుల్ ఫిల్ కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి రైతులు ఓటు వేశారని, అలాంటి రైతులను నిండా ముంచిన ప్రభుత్వం ఇప్పుడు నడుస్తోందని మండిపడ్డారు. కౌలు రైతులకు ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైంది ? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి కౌలు రైతుల గురించి ఎందుకు మాట్లాడడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఇటీవల రైతు భరోసా ఇచ్చారని తెలిపారు. రైతు భరోసా కూడా ఇచ్చిన హామీ ప్రకారం ఇవ్వడం లేదని, రూ.15 వేలు అని చెప్పి.. రూ.12 వేలు ఇచ్చారని వివరించారు.



రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు: కల్వకుంట్ల కవిత

విశ్వంభర, వరంగల్ : రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి చేతిలో గుణపాఠం తప్పదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం ఓరుగల్లు పర్యటనకు వచ్చిన ఆమె హనుమకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'రాహుల్‌గాంధీని వరంగల్‌కు తీసుకొచ్చి రైతు డిక్లరేషన్ చేయించిన కాంగ్రెస్ నేతలు అందులో ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదు. రైతు రుణమాఫీ 50% మందికి కాలేదు. తెలంగాణ సాధనకు ముందు 789 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి 400 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందజేసింది. మిగతా 389 మంది కుటుంబాలకు నాలుగేళ్ల పాటు తెలంగాణ జాగృతి తరఫున నెలకు రూ.4,500 చొప్పున పింఛను అందించాం. మామునూర్ విమానాశ్రయానికి రాణీ రుద్రమదేవి పేరు పెట్టాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏనాడూ జై తెలంగాణ అసని రేవంత్‌రెడ్డి నేడు రాష్ట్రానికి సీఎం కావడం ప్రజల దురదృష్టం. ఆగస్టున 6న ఆచార్య జయశంకర్ జయంతి ఉత్సవాలను వరంగల్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తాం' అని కవిత వెల్లడించారు.

బీఎస్ఎఫ్ జవాన్లకు 5 వేల బాడీ కెమెరాలు

విశ్వంభర, నేషనల్ బ్యూరో : దేశంలోకి వచ్చిన అక్రమ చొరబాటుదారులను వెనక్కి పంపించే క్రమంలో సాయుధ బలగాలపైనే తిరగబడుతూ దాడులు చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్న సరిహద్దు బలగాలు.. ఇటువంటి ఘటనలను ఆధారాలతో సహా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా భారత్‌బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దులోని బీఎస్ఎఫ్ జవాన్లకు 5వేలకు పైగా శరీరానికి ధరించే కెమెరాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వీటితోపాటు ఎంపిక చేసిన సరిహద్దు ఔట్ పోస్టుల్లోని సిబ్బందికి ఫింగర్‌ప్రింట్, ఐరిస్ స్కాన్ వంటి బయోమెట్రిక్ పరికరాలను అందించనున్నట్లు తెలిసింది. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారుల నుంచి సేకరించిన ఈ సమాచారాన్ని ఫారినర్స్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు అందజేయనున్నట్లు తెలుస్తోంది. బీఎస్ఎఫ్ ప్రతిపాదించిన ఈ రెండు విధానపరనిర్ణయాలపై సమగ్ర సమీక్ష అనంతరం కేంద్ర హోంశాఖ ఇటీవల ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇందులో భాగంగా రెండు దశల్లో వీటిని భారత్‌బంగ్లా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న బీఎస్ఎఫ్‌కు అందజేస్తున్నట్లు తెలిసింది. రాత్రిపూట చిత్రీకరణ, 1214 గంటల ఫుటేజీ నిక్షిప్తం చేసుకునే సామర్థ్యం ఈ కెమెరాలకు ఉన్నట్లు తెలిసింది.

హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలి

గురుకులాల్లో ఘటనలపై మాజీ మంత్రి హరీశ్‌రావు వినతి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ఆహారం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతుండటం..ఆరోగ్య పరిస్థితి విషమించి కొందరు మృతిచెందిన నేపథ్యంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించి విచారణ చేపట్టాలని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు కోరారు. నాగర్‌కర్నూల్ పురపాలకసంఘ పరిధిలోని ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిబాఫులే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి ఆహారం వికటించి అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆదివారం హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ''రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత 20 నెలల్లో ఆహారం వికటించి వంద మంది విద్యార్థినులు మృతిచెందినా ఆయన గుండె కరగదా.. గురుకుల పాఠశాలల్లో అనారోగ్యానికి గురవుతున్న పిల్లలను చూడటానికి ఆయన ఎందుకు రావడం లేదు'' అని ప్రశ్నించారు. ''సీఎం సొంత జిల్లాలో నెలరోజుల్లోనే పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్ గురుకుల పాఠశాలల్లో ఆహారం వికటించి విద్యార్థులు ఆసుపత్రులపాలు కావడం దారుణం. అలాగే జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం బీసీ గురుకుల పాఠశాలల్లో వివిధ కారణాలతోను.. హుస్నాబాద్ బీసీ గురుకులంలో ఎలుకలు కొరికి.. విద్యార్థులు ఆసుపత్రులపాలైనా ఈ ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. ఉయ్యాలవాడ గురుకుల విద్యార్థినులను పరామర్శించడానికి భారాస నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు వస్తున్న విషయం తెలుసుకొని హడావుడిగా పోలీసులను పెట్టి పిల్లలను బలవంతంగా జనరల్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడంతోపాటు నాణ్యమైన భోజనం అందించకపోతే భారాస ఆధ్వర్యంలో గురుకుల బాట కార్యక్రమం చేపట్టి పోరాడుతాం. గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న సంఘటనలపై చర్చించడానికి ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు దా.లక్ష్మారెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్రకు పోటెత్తిన వరద

విశ్వంభర, అమరావతి బ్యూరో : తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం ఆదివారం మరింత పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి 77 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యామ్ భద్రత దృష్ట్యా 26 గేట్లను పైకెత్తి 90 వేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. 10 గేట్లను రెండడుగులు, 16 గేట్లను మూడున్నర అడుగులు పైకెత్తి నీటిని వదిలారు. విద్యుదుత్పత్తికి కలిపి దిగువకు మొత్తం 93 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని డ్యామ్ ఇంజినీర్లు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 75.36 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

శ్రీశైలం నుంచి నీటి విడుదల..

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం ఒక రేడియల్ క్రస్ట్ గేటును 10 అడుగుల మేర పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 26,698 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. అదే సమయంలో కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 66,417 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,18,274 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రం 6 గంటలకు 882 అడుగులు, నీటి నిల్వ 198.8120 టీఎంసీలుగా నమోదైంది.

వైసీపీ హయాంలో దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలి: యనమల

విశ్వంభర, తుని: వైసీపీ హయాంలో రాష్ట్ర ఖజానా, ఆస్తులను ఆ పార్టీ నేతలు దోచుకున్నారని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. మద్యం కుంభకోణంలో భారీగా అవినీతి జరిగిందని చెప్పారు. కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరం పీఏసీఎస్ అధ్యక్ష, సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధ్యక్షుడిగా పోలిశెట్టి రామలింగేశ్వరరావు, సభ్యులుగా దారకొండ వెంకటరమణ, అనిమిరెడ్డి మల్లిబాబుతో యనమల ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.''వైసీపీ హయాంలో దోచుకున్న సొమ్మును రికవరీ చేసి పేదలకు పంచాలి. ఎవరు చేసిన తప్పులకు వాళ్లే పతనమవుతారు. జగన్ కక్షతో చంద్రబాబును జైల్లో పెట్టడం వల్లే కూటమి ఏర్పడింది. వైకాపా హయాంలో అన్ని రంగాలు విధ్వంసమయ్యాయి. అప్పులు ఎవరి వల్ల పెరిగాయో చర్చకు రమ్మన్నా స్పందించడం లేదు. ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. కూటమి నేతలు అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో ఎదుర్కోవాలి'' అని యనమల రామకృష్ణుడు పిలుపునిచ్చారు.

రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్ నేతలు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలోని గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లో పొరపాటున ఎలాంటి ఘటనలు జరిగినా బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచారంచేస్తూ రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తుండటం దారుణమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిబాపులే బాలికల గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆదివారం ఎమ్మెల్యే దా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డితో కలిసి నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో మంత్రి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని భోజన గది, పరిసరాలను పరిశీలించారు. ప్రిన్సిపల్ లలిత సమక్షంలో విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ''గత బీఆర్ఎస్‌బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనాకాలంలో అన్ని కస్తూర్బా, గురుకుల పాఠశాలల్లో 1,023 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతోపాటు పలువురు మృతిచెందిన విషయం హరీశ్‌రావుకు గుర్తులేదా'' అని ప్రశ్నించారు. సరైన భవనాలు లేకుండా పాఠశాలలు ప్రారంభించడం వల్ల ప్రస్తుతం ఒక్కో పాఠశాల సముదాయంలో రెండు, మూడు మండలాలకు సంబంధించిన బడులు నిర్వహించడంతో విద్యార్థులు కొంతవరకు ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిక నిధులు కేటాయించి విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో ఆహారం వికటించి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవడం దురదృష్టకరమన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి.. బాధ్యులను సస్పెండ్ చేస్తామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జనరల్ ఆసుపత్రి సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించడంతోనే విద్యార్థినులు త్వరగా కోలుకున్నారని తెలిపారు. నెలకోసారి నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలను తనిఖీ చేస్తామన్నారు. వంట ఏజెన్సీలపై అధికారులు నిఘా ముమ్మరం చేయాలన్నారు. పాఠశాలలో నెలకొన్న వివిధ రకాల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'భారత్'ను తర్జుమా చేయొద్దు భాగవత్ సూచన



విశ్వంభర, కొచ్చిన్: భారత్ పేరును తర్జుమా చేయొద్దని, అలా చేస్తే అది తన విలక్షణతను కోల్పోతుందని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. భారత్ అనే గౌరవం ద్వారానే ప్రపంచంలో అది తన ఘనతను చాటుకుంటుందని తెలిపారు. ఆరెస్సెస్ అనుబంధ శిక్షా సంస్కృతి ఉద్ధాన్ న్యాస్ ఆధ్వర్యంలో ఆదివారం కొచ్చిన్‌లో 'జ్ఞాన సభ' పేరుతో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు.ప్రజా బాహుళ్యంలో, వ్యక్తిగతంగా.. భారత్ అనే మాట్లాడాలి. రాయాలి. ఈ నామవాచకాన్ని తర్జుమా చేయకూడదు. ఇండియా అంటే భారత్. అదే నిజం. కానీ భారత్ అంటే భారతే. అందుకే అదే వాడాలి. భారత్ బంగారు పక్షి ఇక ఎంతమాత్రం కాదు. అది ఇప్పుడో సింహం' అని భాగవత్ స్పష్టం చేశారు.

ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు సిద్ధమైన కేంద్రం

ఎంపీలకు అధికార, ప్రతిపక్షాల విప్ జారీ

విశ్వంభర, ఢిల్లీ : కీలక చర్చకు సోమవారం పార్లమెంట్ వేదిక కానుంది. నేటి నుంచి 2 రోజులపాటు ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో అధికార ప్రతిపక్ష పార్టీలు తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. ఉభయసభల సభ్యులూ తప్పనిసరిగా సభలకు హాజరుకావాలని సూచించాయి. ప్రతిపక్షాలు లేవనెత్తిన డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా స్పందించడంతో.. సోమవారం నుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగే అవకాశముంది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్షాలు ప్రతిరోజూ ఆందోళన చేస్తుండటంతో పార్లమెంటు ఉభయ సభలు వరుసగా వాయిదా పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తన ఛాంబర్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించి.. అర్థవంతమైన చర్చలు జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్'పై సోమవారం నుంచి లోక్‌సభలో చర్చకు అనుమతిస్తున్నట్లు ఆయన వెల్లడించడంతో ప్రతిపక్షాలు కూడా పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యాయి. విదేశీ పర్యటన ముగించుకొని వచ్చిన ప్రధాని మోదీ సోమవారం సభకు వచ్చే అవకాశం ఉంది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఈ చర్చల్లో పాల్గొననున్నారు.

శీలా, అమ్మినలకు 'అమరవాది' పురస్కారాలు



విశ్వంభర, హైదరాబాద్ : బాలసాహిత్యంతోపాటు, సాహితీరంగంలో విశేష కృషిచేసిన రచయితలకు అమరవాది ఫౌండేషన్ పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా 3 పుస్తకాలను ఆవిష్కరించడంతోపాటు హైదరాబాద్ స్థాయిలో నిర్వహించిన బాలల కథల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డా .పత్తిపాక మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో ఓయూ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా; మాడభూషి స్మారక సమితి అధ్యక్షురాలు మాడభూషి లలితాదేవి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. 2025 సంవత్సరానికిగాను అమరవాది హైమావతి సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవికి, అమరవాది ప్రసాద్ బాలసాహిత్య పురస్కారాన్ని బాలసాహితీవేత్త డా.అమ్మిన శ్రీనివాసరాజుకి ప్రదానం చేశారు. సభలో తొలుత అమరవాది నీరజ రచించిన బాలల బొమ్మల పుస్తకం అంజు, పత్తిపాక మోహన్ తెలుగు బాలగీతాల పుస్తకం 'ఆకుపచ్చపాట'కు డా.షేక్ అబ్దుల్‌ఘనీ చేసిన హిందీ అనువాదం 'హరేభరే గీత్', బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్ పిల్లల కథల పుస్తకం 'గోటీలాట'ను ఆచార్య కసిరెడ్డి ఆవిష్కరించారు. సాహితీవేత్తలు శాంతారావు, ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, మంచిరాజు కామేశ్వరరావు, కొసరాజు సురేష్, డాక్టర్ నాళేశ్వరం శంకరం, చింతకింది కామేశ్వరరావు, మాల్యా, డా.హారిక చెరుకుపల్లి, జొన్నలగడ్డ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల అనర్హతపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలి: జస్టిస్ లావు నాగేశ్వరరావు

విశ్వంభర, విజయవాడ: ప్రజాప్రతినిధులపై అనర్హత అంశం బ్లాక్‌షీప్‌లా తయారైందని.. 'నోటా' నిష్ప్రయోజనంగా మారిందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. 'భారత రాజ్యాంగంజవాబుదారీతనం'పై విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సిటిజన్ ఫర్ డెమోక్రసీ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పబ్లిక్ లెక్చర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, విశ్రాంత ఏజీ సీతారామమూర్తి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ ''పార్టీ ఫిరాయింపులను రాజ్యాంగం సమ్మతించదు. ప్రజాప్రతినిధుల అనర్హతపై 3 నెలలు లేదా వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలి. స్పీకర్లు నిర్దిష్ట సమయంలో నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో 45 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి''అని అన్నారు.